# వలయం చివర్లో

సాయంత్రం స్కూలు ముగిసే సమయానికి గురునాథం మాస్టారు దగ్గర ట్యూషన్ చెప్పించుకునే రాజు పరుగెత్తుకుంటూ వచ్చి, "సార్, మరండీ......... మీకోసమండీ, రామవరప్పాడు నుండి ఒకాయన వచ్చాడండీ. మీతో మాట్లాడాలట. మనింటి అరుగుమీద కూర్చోబెట్టి వస్తున్నానండీ" అన్నాడు రొప్పుతూ.

గురునాథం ఈ ఊళ్లో పనిచేయక ముందు రామ వరప్పాడులో పనిచేశాడు. అక్కడి నుండి బదిలీ అయి వచ్చి రెండు నెలలు దాటాయి. ఆ ఊళ్లో అతనికి చుట్టాలు ఎవరూ లేరు. ఆ ఊరు ఇక్కడికి వంద మైళ్లు పైగా ఉంటుంది. అంతదూరం నుండి తనను చూసేందుకు వచ్చింది ఎవరయి ఉంటారో ఎంత ఆలోచించినా అతని ఊహకు అందలేదు. రాజుతో నడుస్తూ, "వచ్చిన ఆయన తన పేరు చెప్పాడా?" అడిగాడు గురునాథం.

"నేను అడిగానండీ, చెప్పలేదు.వెళ్లి మీ మాస్టారును పిలుచుకురా అన్నాడండీ. బొంగురు గొంతు పెద్దగా చదువుకున్న వాడిలా లేడు. పొడుగ్గా, సన్నగా, నల్లగా ఉన్నాడు."

ఎంతసేపు ఆలోచించినా ఆ వ్యక్తి ఎవరో గురునాథానికి తట్టలేదు. ఇంటికి చేరుకున్నాక అరుగుమీద కూర్చున్న వ్యక్తి అరుగు దిగి చేతులు జోడించి గురునాథానికి నమస్కారం చేసి, "నన్ను గుర్తు పట్టారా, రామవరప్పాడు నుండి వస్తున్నాను....." అన్నాడు. ఆ ఊళ్లో ఈ వ్యక్తిని చూసిన గుర్తులేదు. ఈవేళే అతన్ని మొదటిసారిగా చూస్తున్నాడు. ఒకసారి పరిచయం అయిన వాళ్లను సామాన్యంగా తను మర్చిపోడు. ప్రతి నమస్కారం చేసి మర్యాదపూర్వకంగా నవ్వి తలుపుకు వేసిన తాళం తీసి తలుపు తెరిచి "రండి" లోపలికి నడుస్తూ కొత్త వ్యక్తిని ఆహ్వానించి అతను లోపలికి రాగానే మంచం వాల్చి దుప్పటి వేశాడు.

"కూర్చోండి" అన్నాడు గురునాథం.

ఆ వ్యక్తి మంచం మీద కూర్చొని, "నన్ను మీరు గుర్తుపట్టినట్లు లేదు కదూ?" అడిగాడు.

గురునాథం కుర్చీ మంచం దగ్గరకు లాక్కుని కూర్చుని సన్నగా నవ్వి తల ఆడించాడు.

"నా పేరు అప్పయ్య."

ఆపేరు తను చాలాసార్లు విన్నాడు.కాని ఎప్పుడూ కలుసుకోలేదు.

"నన్ను తులసి పంపించింది" నెమ్మదిగా అన్నాడు అప్పయ్య.

తులసి తనకు బాగా తెలుసు. ఆమెకు ముప్పయి సంవత్సరాల వయసు ఉంటుంది. అందంగా ఉంటుంది. ఇద్దరు పిల్లలు పుట్టినా మనిషి ఎంతో చలాకిగా ఉండేది. తనకు ఆమెతో ఎలా పరిచయం అయిందో గుర్తులేదు. కాని ఆ పరిచయాన్ని చాలా దూరం తీసుకెళ్లారు. ఇంటికి దగ్గర ఇల్లు కాకపోయినా ధైర్యంచేసి ఎంత రాత్రైనా వస్తుండేది. ఊరుకాని ఊరు. ఎప్పుడు ఏమవుతుందో అర్థంకాని పరిస్థితి. ఆమె వెళ్లిపోయే వరకు భయంగా ఉండేది. అంత గుండె నిబ్బరం, తెగింపు తను ఎవరి దగ్గరా చూడలేదు.

"మన విషయం మీ ఆయనకు తెలిస్తే ఏమైనా ఉందా? నీకేం నువ్వు బాగానే ఉంటావు" అని చాలా సార్లు అన్నాడు.

అలా అన్నప్పుడు తులసి పకపక నవ్వి ముఖమంతా ముద్దులు పెట్టుకుని, "నేను బతికుండగా మీకేంకాదు. మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డం. సరేనా?" అని తేలికగా కొట్టేసేది.

గురునాథం అప్పయ్య ముఖంలోకి చూసి, "తులసి ఎలా ఉంది?" అడిగాడు.

"బావుంది. చాలా బావుంది."

"బదిలీ అయిన తరువాత అటు రాలేకపోయాను. మీరు కాఫీ తాగుతారా, టీ తాగుతారా?"

"ఏమీ తాగను. అలవాటు లేదు. మీరు తులసిని మర్చిపోయారట....."

"మర్చేంపోలేదు. ఎప్పటికప్పుడు వద్దామనుకుంటాను. వీలుచిక్కదు. ఏదో పని పడుతుంది. ఇంకో సమస్యేమిటంటే మీ ఊరు రావాలంటే మూడు బస్సులు మారాలి."

"ఈ శని,ఆదివారాల్లో మీకు ఎన్ని పనులున్నా పక్కనపెట్టేసి, తప్పకుండా రమ్మన్నానని మీతో మరీమరీ చెప్పమంది."

"ఏమిటి విశేషం?"

"విశేషమే. తులసి కడుపుతో ఉంది."

"ఎన్నో నెల?"

చెప్పాడు అప్పయ్య. కొద్దిసేపు మౌనంగా ఉండి భుజం మీదున్న తువ్వాలుతో ముఖం తుడుచుకుని, "తులసికి మీరంటే ప్రాణం. ఎప్పుడూ మీ గురించే మాట్లాడుతుంటుంది. ఈ శని,ఆదివారాల్లో మీరుగనక రాకపోతే తనే ఇక్కడికి వస్తుందని మీతో చెప్పమంది" అన్నాడు.

గురునాథం నవ్వి, "వార్నింగ్ అన్నమాట ....... నా భయమేమిటంటే వాళ్లాయన......" అంటుంటే రాజు గురునాథం దగ్గరకు వచ్చి, "సార్ చిలకకు ఏమన్నా పెట్టమంటారా?" అడిగాడు.

రాజుకు గురునాథం దగ్గర ఉన్న చిలకంటే ప్రాణం. సమయం చిక్కితే చాలు

బల్లమీదున్న పంజరం దగ్గరే ఉండి, "మరండీ చిలకనన్ను చూసి తలాడించిందండీ" "నా వేలు కొరికిందండీ" "నన్ను వెక్కిరించిందండీ" అని అంటుంటే గురునాథానికి విసుగొస్తుంటుంది. కాని రాజు ఇంటి పనులన్నీ చేస్తుండటం వలన విసుగు వ్యక్తం చేసేవాడుకాదు. నవ్వేసి ఊరుకునేవాడు.

"కొద్దిసేపు ఆగు. నేను వచ్చేంతవరకు పంజరం మూత తీయకు" అన్నాడు గురునాథం. ముఖం చిన్నబుచ్చుకుని రాజు గోడకు ఆనుకుని నిల్చున్నాడు.

అప్పయ్య లేచి తను తెచ్చిన సంచిలోంచి రెండు తేనె సీసాలు, మొక్కజొన్న కండెలు, పెద్ద పొట్లంలో అరిసెలు బయటకు తీసి బల్లమీద పెట్టి, "ఇవన్నీ మీకు తులసి పంపించింది. ఇంకేమన్నా కావాలంటే చెప్పండి. ఈ సారి వచ్చేప్పుడు తీసుకొస్తాను. అయినా మీరీ శనివారం వస్తున్నారు కదా, మీకు ఇష్టమయింది చేయించుకోవచ్చు. నాకు సెలవిప్పించండి. వెళ్ళొస్తాను." అని సంచి మడిచి చేత్తో పట్టుకున్నాడు. గురునాథం లేచి అతని భుజంమీద చేయివేసి "మీకు శ్రమ కలిగించాను, శనివారం ఉదయం పదింటికల్లా మీ ఊళ్లో ఉంటాను. కొద్దిసేపు ఆగారంటే భోజనం తయారు చేయిస్తాను. అరగంట పని, తిని వెళ్దురుగాని" అన్నాడు.

"అంత సమయం లేదండీ. ఏ కొద్దిగా ఆలస్యం అయినా బస్సు తప్పిపోతుంది. నాకు ఇబ్బంది అవుతుంది."

వీధి గుమ్మం వరకు వచ్చి, అప్పయ్యను సాగనంపుతూ, "తులసి మీకేమవుతుంది?" అడిగాడు గురునాథం.

అప్పయ్య కదలబోయేవాడల్లా ఒక్కక్షణం ఆగి గురునాథాన్ని పరీక్షగా చూసి, "తులసి నా భార్య" అని చకచకా నడుచుకుంటూ వెళ్లిపోయాడు.

గురునాథం ఆశ్చర్యంలోంచి తేరుకునేలోగా అప్పయ్య కనుమరుగయిపోయాడు. తులసి తన భర్తతోనే కబురు పంపిస్తుందని అతను ఊహించలేదు. గురునాథం ఇంట్లోకి వచ్చాడు. బల్లమీద ఉన్న మొక్కజొన్న కండెలు లెక్కపెడుతున్న రాజు తలెత్తి, "సార్ చిలకకు తేనె పడదామండీ. మాటలు వస్తాయట" అన్నాడు.

వేగంగా నడుచుకుంటూ వెళ్లిపోతున్న అప్పయ్య గురునాథం మనసులోంచి తొలగిపోలేదు. అన్యమనస్కంగా తేనె సీసా అందుకుని ఒక చిన్న గిన్నెలో తేనె పోసి రాజుకిచ్చాడు. రాజు పంజరం మూత తీసి చిలకను అందుకుని దాని నోరు తెరచి అయిదారు తేనె చుక్కలు చిలక నాలుక మీద వేశాడు. రెండు క్షణాల తరువాత చిలక గిలగిలా తన్నుకుని చచ్చిపోయింది.

◆ చుక్కాని పక్షపత్రిక, 15 ఆగస్టు 1964